క్లుప్తంగా

వాజ్‌పేయికి నివాళి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్‌రాజు, నాయకులు

సీతమ్మధార: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో బీజేపీ ఉత్తర కార్యాలయంలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురాంరాజు, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సురేష్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బి.ఎస్.రెడ్డికి అటల్ గౌరవ్ సమ్మాన్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న బి.ఎస్.రెడ్డి

సీతంపేట: అంతర్జాతీయ మెజీషియన్, నగరవాసి బి.ఎస్.రెడ్డి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అటల్ గౌరవ్ సమ్మాన్–2023 అవార్డును కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి మహేంద్ర కలుభాయ్ ముంజపర చేతుల మీదుగా అందుకున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా అటల్ ఫౌండేషన్ సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కలిగి దేశవిదేశాల్లో తమ ప్రతిభ పాటవాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారి సేవలకు గుర్తుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డిని నగరానికి చెందిన పలువురు మెజీషియన్లు అభినందించారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి మాధవధారలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. మాన్యం ప్రాంతంలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, యూజీడీ పనులను స్వయంగా పరిశీలించి తగు సూచనలిచ్చారు. కె.కె.రాజు వెంట 14వ కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి ఉన్నారు.

వరద నీటికి అడ్డుకట్ట

- 49వ వార్డులో తొలగిన ముంపు సమస్య
- రూ.23.50 లక్షలతో కల్వర్టుల నిర్మాణం
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం



ప్రజల కష్టాలను తెలుసుకుని.. వాటి పరిష్కారానికి సరైన చర్యలు తీసుకుంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోంది. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు కాలనీల్లో ప్రజల సీజనల్‌గా పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకుని వారి అవసరాలు తీరుస్తోంది. వర్షాకాలంలో కాలనీల్లో వరద నీటి తాకిడికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంది.

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో సుమారు రూ.23.50 లక్షలతో గెడ్డలపై కల్వర్టులు నిర్మించి ప్రజల సమస్యలను పరిష్కరించారు. తద్వారా వర్షా కాలంలో కాలనీల్లో ప్రధాన రహదారుల్లో వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడింది.

కూలిపోయే స్థితి నుంచి..
పట్టాభిరెడ్డి తోట దాసాంజనేయ స్వామి ఆలయ సమీపంలో గతంలో గెడ్డపై నిర్మించిన కల్వర్టు కూలిపోయే స్థితి నుంచి నేడు పక్కా కల్వర్టుగా మారేందుకు చర్యలు తీసుకున్నారు. నివాస ప్రాంతాల మధ్య నుంచి ప్రవహించే కొండ గెడ్డ వరద నీటి ప్రవాహ తాకిడికి దిగువన ఆలయం, చుట్టూ నివాసిత ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడేవారు. రెండు రహదారులను కలిపే వై జంక్షన్‌గా ఇక్కడ ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో తెలీని పరిస్థితి. ఇరుగ్గా ఉన్న కల్వర్టు నుంచి నిత్యం నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడటంతో మురుగు నీటి ప్రవాహం రహదారిపైకి చేరుకునేది. దీనిపై స్పందించిన కార్పొరేటర్ అల్లు శంకరరావు.. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో రూ.14 లక్షల జీవీఎంసీ నిధులతో పక్కా కల్వర్టును నిర్మించారు. దీంతో ప్రజలు, ప్రయాణికుల కష్టాలు తీరాయి.


నేడు : పట్టాభిరెడ్డితోటలో ఆధునికీకరించిన కల్వర్టు


నాడు : పట్టాభిరెడ్డితోటలో ప్రధాన రహదారిపై అధ్వానంగా కల్వర్టు

కల్వర్టు నిర్మించిన ప్రాంతం	నిధులు
పట్టాభిరెడ్డి తోట	రూ.14 లక్షలు
మాణిక్యాంబ కాలనీ	రూ.3 లక్షలు
రజక కాలనీ	రూ.5 లక్షలు
అయ్యప్పనగర్	రూ.1.50 లక్షలు


మాణిక్యాంబ కాలనీలో నిర్మించిన కల్వర్టు


అయ్యప్పనగర్ రహదారిపై నిర్మించిన కల్వర్టు

పేదల ఇళ్లకు రక్షణగా..
మాణిక్యాంబ కాలనీలో కల్వర్టు సమస్య దశాబ్దాలుగా నలుగుతోంది. వచ్చిన ప్రభుత్వ పెద్దలు, నాయకులు ఈ ప్రాంతంలో గెడ్డ కల్వర్టు నిర్మిస్తామని చెప్పడమే తప్ప పరిష్కారానికి నోచుకోలేదు. జగనన్న ప్రభుత్వం స్పందించి రూ.3 లక్షల జీవీఎంసీ నిధులతో కల్వర్టును నిర్మించింది. దీంతో వీరికి వరద భయాలు తొలగాయి. గెడ్డకు రెండు వైపులా ఉన్న ఇళ్లకు వరద నీటి ప్రమాదం తప్పింది.


నేడు : చాకలిగెడ్డపై ఆధునికీకరించిన కల్వర్టు (ఇన్‌సెట్) నాడు : చాకలిగెడ్డపై నివాసాల మధ్య శిథిలావస్థలో కల్వర్టు

చాకలి గెడ్డపై..
చాకలి గెడ్డ మీదుగా రజక కాలనీలోని అంబేడ్కర్ ఆవాస్ యోజన కాలనీ ఇళ్ల సముదాయాన్ని కలుపుతూ కల్వర్టు నిర్మించాల్సి ఉంది. పాతికేళ్ల కిందట నిర్మించిన కల్వర్టు కూలిపోయే స్థితిలో ఉండేది. ఎగువ బర్మా క్యాంపును కలుపుతూ నిర్మించిన రహదారిపై ఉన్న కల్వర్టు బలహీనంగా తయారవడంతో ప్రజలు భయం భయంగా రాకపోకలు సాగించేవారు. తూర్పు వైపు గెడ్డ నుంచి వేగంగా ప్రవహించే గెడ్డ నీటితోపాటు మురుగునీరు దీని దిగువగా ప్రవహించి చాకలి గెడ్డలో కలుస్తుంది. లోతట్టుగా ఒక లోయలా ఉంటుంది. ఇది కూలితే నివాస ప్రాంతాలకు ప్రమాదాలు ఏర్పడతాయి. దీన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల జీవీఎంసీ నిధులతో కల్వర్టు నిర్మించి వీరి సమస్యను తీర్చింది.

నిరాటంకంగా మురుగు నీటి ప్రవాహం
మురళీనగర్ సెక్టార్–3లో ప్రశాంతి పార్కుకు వెళ్లే మార్గం అయ్యప్పనగర్ రహదారిలో రూ.1.50 లక్షలతో కల్వర్టు నిర్మించి మురుగు నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేశారు. ప్రజల ప్రధాన సమస్యలకు తక్షణం పరిష్కారం చూపించడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనపై ఆయా ప్రాంతాలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటి ఇబ్బందులు తీరాయి



మా ప్రాంతంలో గతంలో కల్వర్టు శిథిలం కావడం వల్ల మురుగు నీరు రోడ్డుపైకి వచ్చేది. అఫీషియల్ కాలనీ అయినప్పటికీ రహదారి మధ్య నుంచి బయటికి పోవాల్సిన నీరు నిలిచిపోయి పొంగేది. వర్షాకాలంతో పాటు ఇతర రోజుల్లోనూ ఈ సమస్య ఉండేది. గతంలో చాలా మందికి చెప్పినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కల్వర్టు నిర్మించడం వల్ల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.
– గంపా భాస్కర్, అయ్యప్పనగర్

కల్వర్టుల నిర్మాణంతో రక్షణ



మా ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మించడం వల్ల నివాస ప్రాంతాల ప్రజలకు రక్షణ ఏర్పడింది. గతంలో వర్షాల సమయంలో చాకలి గెడ్డ వరద నీటి ప్రవాహం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందోనని భయపడేవారం. గెడ్డకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు ప్రమాదం ఏర్పడేది. పక్కా కల్వర్టుల నిర్మాణం వల్ల భయం తీరింది. ఇళ్లకు రక్షణ ఏర్పడింది.
– జయంత్, మాణిక్యాంబ కాలనీ

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


బేతల్ అసెంబ్లీ చర్చిలో క్రిస్మస్ సందేశానిస్తున్న పాస్టర్ జాన్ సుందర్


క్రిస్మస్ సందేశమిస్తున్న సిస్టర్ షైలాపాల్


కేకలు పంపిణీ చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: క్రిస్మస్ పర్వదిన వేడుకలను సోమవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు కుటుంబ సమేతంగా చర్చిలకు వెళ్లి ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు బైబిల్ వాక్య సందేశమిచ్చారు. అనంతరం క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద బంధుమిత్రులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

శాంతిమయ జీవనమే క్రీస్తు ప్రబోధం
తోటి వారిపై ప్రేమాభిమానాలతో నడుచుకున్న ప్రతి ఒక్కరూ దైవ సమానులేనని క్రీస్తు తన జీవితం ద్వారా ప్రపంచానికి చాటాడని పాస్టర్ గండి జాన్ సుందర్ అన్నారు. సత్యం కంప్యూటర్స్ జంక్షన్ వద్ద గల బేతల్ అసెంబ్లీ చర్చిలో జరిగిన వేడుకల్లో ఆయన క్రిస్మస్ సందేశానిచ్చారు. ప్రపంచానికి శాంతిమయ జీవనాన్ని ప్రబోధించిన ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలన్నారు. చర్చి నిర్వాహకుడు గండి రవికుమార్ మాట్లాడుతూ క్రీస్తులోని ప్రేమ, దయ, క్షమ, గొప్పతనానికి అద్దం పట్టే బైబిల్‌లోని పలు సూక్తులు, వాక్యాలు, అంశాలను వివరించారు. క్రిస్టియన్లు పెద్ద ఎత్తున చర్చికి వచ్చి ప్రార్థనలు చేశారు. చర్చి యూత్ గీతాలు ఆలపించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..
సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులతో క్రిస్మస్ కేక్ కట్‌చేయించారు. పార్టీ శ్రేణులకు కేక్‌లు పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం దరి వరాహగిరి కాలనీలోని క్రైస్ట్ గాస్పల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రదర్ పి.విజయ్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చిన్నారులు, యువత పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రత్యేక గీతాలతో, వీనుల విందైన సంగీతంతో, లఘునాటికలను, క్రీస్తు జనన విధానం గురించి తెలిపే క్రిస్మస్ స్కిట్లు ప్రదర్శించారు. పాస్టర్ ఎస్.మోహనరావు, చర్చి యువత, చిన్నారులు, విశ్వాసులు, స్థానికులు పాల్గొన్నారు.

లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ వేడుకలు
లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ ఆధ్వర్యంలో గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సెంటర్ వ్యవస్థాపకురాలు సిస్టర్ షైలాపాల్ క్రీస్తు జననం గురించిన సందేశాన్ని అందించారు. యువత ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. నగర నలుమూలల నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో..
కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీస్టార్ వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు వాకర్ గుమ్మిడి అచ్చిబాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి రెవరెండ్ పాస్టర్ డి.డేవిడ్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాకర్స్ సభ్యులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. వాకర్స్ అధ్యక్షుడు ఆర్.ఆర్.ఎస్.మహేశ్వరరావు, కె.రాజశేఖర్, బి.ఇమ్మాన్యుయేల్, సాన అప్పారావు, ఇ.ప్రకాష్‌రావు, ఏఎంబీ రావు, డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ సభ్యులు ఆర్‌సీపీ ఎం.అర్జునుడు, పి.సుకుమార్, ఎం.నూకరాజు, ఎస్.సుర్యారావు, టీఎస్ఎన్ రాజు, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రీస్తు జనన వృత్తాంతం
మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని చర్చిల్లో ఫాదర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మురళీనగర్ 48 బస్ రూట్‌ను ఆనుకుని ఉన్న సెయింట్ జేవియర్స్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాధవధార, మురళీనగర్ పరిసరాల క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రీస్తు జనన వృత్తాంతం సెట్ ఆకట్టుకుంది. ఫాదర్ రాజశేఖర్ దైవ వాక్యాన్ని వినిపించి ఆశీస్సులు అందించారు.


క్రైస్ట్ గాస్పల్ చర్చిలో క్రీస్తు జననం స్కిట్ ప్రదర్శిస్తున్న యువత, చిన్నారులు


శ్రీస్టార్ వాకర్స్ క్లబ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, సభ్యులు


మురళీనగర్ సెయింట్ జేవియర్స్ చర్చిలో క్రీస్తు జననం సెట్

ప్రతిష్టాత్మకంగా ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు



మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘ఆడుదాం ఆంధ్రా’ ఆటల పోటీలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందన్నారు. ఇప్పటి వరకు కోటి 40 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందడమే కాకుండా మనిషిలో సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు.

ప్రజల దృష్టి మరల్చేందుకు టీడీపీ కుయుక్తులు..
నగరంలోని పలు వ్యాపారస్తులను, బిల్డర్లను బెదిరించి ప్రజల దృష్టిని మళ్లించేలా టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు, ఇతర నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మూడు రాజధానుల ప్రతిపాదనను తీసుకొచ్చి విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తుండటం ద్వారా ప్రభుత్వంపైన మంచి సానుకూల దృక్పథం ఉందని చెప్పారు. ఇటువంటి తరుణంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. లోకేష్ చేసిన పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో విశాఖ ప్రజలను మభ్యపెట్టేందుకు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

నేడు డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో ప్రారంభం
‘ఆడుదాం ఆంధ్రా’ ఆటల పోటీలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో ప్రారంభమవుతాయని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయం తెలిపింది. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొంది.

‘గ్రీవెన్స్’తో సమస్యల పరిష్కారం


సుధావాణికి నగదు అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందించారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటినీ తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కె.కె.రాజు ఆర్థిక సాయం
గ్రీవెన్స్ కార్యక్రమంలో తాటిచెట్లపాలేనికి చెందిన అల్లూరి సుధావాణి అనే మహిళ సమన్వయకర్త కె.కె.రాజును కలిసి తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని విన్నవించుకుని అర్జీ ఇవ్వడంతో వెంటనే స్పందించిన ఆయన ఆర్థిక సాయం అందజేశారు.

కాపుల ద్రోహి పవన్ కల్యాణ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కాపు నేతలు

సీతమ్మధార: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కాపులకు అన్యాయం చేసిందని, అటువంటి పార్టీకి మద్దతు పలికి కాపుల ఆత్మాభిమానాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలుగుదేశానికి తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ కాపు నేతలు మండిపడ్డారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కాపు యువత ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును కాపు నాయకులు కలవాలంటే అపాయింట్మెంట్ ఇచ్చే వారు కాదని, అలాంటి పార్టీకి మద్దతు పలుకుతూ పవన్ కల్యాణ్ కాపుల ద్రోహిగా మారారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేసిన ప్రతి ఒక్కరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని కొనసాగించేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, సమ్మిట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలకు మూలం మనువాదం


మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న సమాఖ్య సభ్యులు

మద్రిపాలెం: సామాజిక అసమానతలకు మూలం మనువాదమేనని దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. 53వ వార్డు నరేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మనుధర్మ శాస్త్ర దహన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మనుస్మృతి వద్దు.. మానవత్వం ముద్దు, కుల వ్యవస్థకు మూలమైన మత గ్రంథాలను వీడాలని, కుల నిర్మూలనా పోరాటాలు వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 1927 డిసెంబర్ 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మనుధర్మ శాస్త్రాన్ని దహనం చేశారని గుర్తుచేశారు. మాకవరపాలెం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొరివి సుందరరావు మాట్లాడుతూ కుల వ్యవస్థలకు మనుస్మృతి మూలమైందన్నారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, సన్యాసమ్మ, గుడివాడ అప్పారావు, రవికుమార్, నూకరాజు, విజ్ఞానంద్ రాంప్రభు, రాంజీ, దుర్గారావు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ విజయోత్సవం



వాకర్స్ క్లబ్ సాధించిన అవార్డులు

మురళీనగర్: ఇటీవల నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళనంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సాధించిన ప్రగతిపై వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ ఆధారంగా 8 అవార్డుల తోపాటు ఆరు ప్రాయోజిత పురస్కారాలు పొందారు. ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డులు పొందడం వాకర్స్ క్లబ్ చరిత్రలో ఇదే తొలిసారని చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను, ప్రస్తుత కార్యవర్గ సభ్యులను వాకర్స్ క్లబ్ సభ్యులు, పూర్వ అధ్యక్షులు అభినందించారు. క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సింగరాయిమెట్ట ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పైడి మానస బీటెక్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. తరచూ అక్కడి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవకు వెళ్తుంటారు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో సేవకు వెళ్తానని చెప్పి సదరు యువతి ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం దాటినా రాకపోవడంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి తండ్రి పైడి నర్సింగరావు ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.